క్లుప్తంగా

శ్రీవారి సేవలో..


శ్రీవారి ఆలయంలో బుల్లితెర నటి శృతి

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయాన్ని సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్, బుల్లితెర నటి సింగంపల్లి శృతి మంగళవారం సందర్శించారు. భవానీ దీక్షను విరమించేందుకు విజయవాడ వెళ్లే క్రమంలో ఆమె కుటుంబ సమేతంగా ఈ క్షేత్రానికి విచ్చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల నుంచి ఆశీర్వచనాన్ని పొందారు.

కోడిపందేల స్థావరంపై దాడి

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం, తాటిరామన్నగూడెం శివారులో కోడిపందేల స్థావరంపై సీఐ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడిలో 13 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. అలాగే వీరి వద్ద నుంచి 4 కోడిపుంజులు, రూ.9,870 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

వివాహిత ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఒక వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల ప్రకారం.. శ్రీనివాసపురానికి చెందిన కొడపల్లి మేరీ (28)కి, ప్రసాద్‌కు 2015లో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. ప్రసాద్ జంగారెడ్డిగూడెంలోని ఓ మద్యం దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆదాయం అంతంత మాత్రంగా ఉండటంతో వారు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మంగళవారం ప్రసాద్ తన తల్లికి అనారోగ్యం కారణంగా ఆమెకు మందులు తీసుకువచ్చేందుకు సత్తుపల్లి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఆర్థిక సమస్యలను తాళలేక మేరీ గదిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి మణి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రతి ఒక్కరూ జగన్ కావాలంటున్నారు

- సంక్షేమం, అభివృద్ధే అందుకు కారణం
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో పింఛన్ తీసుకుంటున్న ప్రతి లబ్ధిదారుడు మళ్లీ జగన్ రావాలి.. జగన్ కావాలంటున్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా ఇన్‌చార్జి పినిపే విశ్వరూప్ అన్నారు. సీహెచ్.పోతేపల్లి, కోడిగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో విశ్వరూప్‌తో పాటు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు, రాజమండ్రి ఎంపీలు కోటగిరి శ్రీధర్, మార్గాని భరత్‌రామ్, ఏలూరు జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు సీహెచ్.పోతేపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఎస్సీ కమ్యూనిటీ హాలు భవనాలను, అలాగే కోడిగూడెంలో పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అంతక ముందు సీహెచ్.పోతేపల్లిలో జరిగిన సభలో పలువురు లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందించారు. అనంతరం మంత్రి విశ్వరూప్


సీహెచ్.పోతేపల్లిలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే

మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు దేశంలోనే ఏ రాష్ట్రంలోను లేవన్నారు. 2014లో చంద్రబాబు గద్దెనెక్కేందుకు పింఛన్‌ను రూ. వెయ్యి చేస్తానని హామీ ఇచ్చి ప్రజలను మోసగించారన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 2,750 పింఛన్‌గా అందిస్తున్నారని, మరో మూడు నెలల్లో అది రూ. 3 వేలు కానుందన్నారు. పింఛన్లు పెంచిన ఘనత వైఎస్సార్ కుటుంబానిదే అని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు కోరిక మేరకు గిరమ్మ ఎత్తిపోతల పథకానికి తన నిధుల నుంచి రూ. 40 లక్షలు, ఎంపీ మార్గాని భరత్ రామ్ నిధుల నుంచి మరో రూ.40 లక్షలు కేటాయిస్తామన్నారు. కారుమూరి, ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ లోకేష్‌కు ఎన్ని జాకీలు పెట్టి పైకి లేపినా ఉపయోగం లేదన్నారు. పవన్ కల్యాణ్ నిన్న మాట్లాడే మాటకు, ఈరోజు మాట్లాడే మాటకు సంబంధం ఉండదన్నారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ పోల్కంపల్లి అనీల్, ఎంపీటీసీ పల్లపాటి ధర్మారావు, సొసైటీ చైర్‌పర్సన్ చెలికాని సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడి సేవలో..

ఐఎస్.జగన్నాధపురంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని మంగళవారం మంత్రులు పినిపే విశ్వరూప్, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీలు కోటగిరి శ్రీధర్, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దర్శించారు.

అఖిలాండేశ్వరీ.. పాహిమాం


కొయ్యలగూడెం: బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు


బుట్టాయగూడెం: గుబ్బల మంగమ్మతల్లికి బంతిపూలతో అలంకరణ


జంగారెడ్డిగూడెం: రజిత కవచాలంకృత శ్రీరాజరాజేశ్వరి దేవిగా కనకదుర్గమ్మ

జంగారెడ్డిగూడెం: దేవీ శరన్నవరాత్రులు వైభవంగా ముగిశాయి. తొమ్మిదిరోజులపాటు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత గంగానమ్మ, నూకాలమ్మ తల్లి చివరిరోజు శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నూకాలమ్మను పోలవరం ఎమ్మెల్యే బాలరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైస్కూల్ రోడ్డులోని కనకదుర్గమ్మ రజిత కవచాలంకృత శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులను అనుగ్రహించింది. ముత్యాలమ్మ తల్లి, వాసవీ మాత ఉదయం మహిషాసుర మర్దినిగా, సాయంత్రం రాజరాజేశ్వరి దేవిగా భక్తులతో పూజలందుకున్నారు.

కొయ్యలగూడెం: వారాహి మాత అలంకరణలో కొయ్యలగూడెంలోని శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ పూజలందుకుంది. ఈ సందర్భంగా భక్తులు శమీ వృక్షానికి విశేష పూజలు నిర్వహించారు. బయ్యనగూడెంలో వెయ్యి మందికి పైగా భక్తులు పెద్ద రామాలయం నుంచి సరిపల్లి రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయం వరకు బోనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

దివ్య రథంలో ఊరేగిన కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ మహిషాసురమర్దనీ, రాజరాజేశ్వరి దేవి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి దివ్య రథోత్సవం సోమవారం రాత్రి శ్రీవారి దేవస్థానం అట్టహాసంగా నిర్వహించింది. శ్రీ వాసవీ మాత రథోత్సవం మంగళవారం సాయంత్రం నేత్రపర్వంగా జరిగింది.

బుట్టాయగూడెం: దసరా పండుగను పురస్కరించుకుని గుబ్బల మంగమ్మ తల్లిని ఆలయ కమిటీ వారు బంతిపూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. దూపదీప నైవేద్యాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

28న జంగారెడ్డిగూడెంలో

గడపగడపకు 200వ రోజు


లింగపాలెంలో పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: చింతలపూడి నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200వ రోజులు పూర్తి చేసుకోనున్న సందర్భంగా శనివారం జంగారెడ్డిగూడెంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. ఈమేరకు మంగళవారం స్థానిక బీవీఎస్ రెడ్డి గెస్ట్‌హౌస్ ఆవరణలో మండల వైఎస్సార్ సీపీ నేతలతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయోత్సవ సభకు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు జంగారెడ్డిగూడెంలో గంగానమ్మ గుడి సెంటర్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. నవరత్నాలు ద్వారా పేద వర్గాల ప్రజలకు భరోసా కల్పిస్తున్న సీఎం వైస్ జగన్‌మోహన రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. లింగపాలెం మండలం నుంచి భారీ బైక్ ర్యాలీతో సభకు వస్తామని పార్టీ నియోజకవర్గ సీనియర్ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి ప్రకటించటంతో ఎమ్మెల్యే ఎలీజా ఆయన్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భీమిరెడ్డి సోమిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, సర్పంచ్‌లు చలగుళ్ల రవిబాబు, తాడేపల్లి శాంతరావు, కట్టుబోయిన రమేష్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ఏఎంసీ డైరెక్టర్ కె రామకృష్ణ, నాయకులు రావి కొండయ్య, కర్లపూడి ఆనంద్, మందలపు నరసింహారావు, కె రఘు, కొత్తూరి రమేష్, యలమంచి సత్తిబాబు, సీహెచ్ సూరిబాబు, గణేష్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన నార్లపాటి జయమ్మ, భర్త: పిచ్చయ్య, వయస్సు: 60 సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం. 11-549, T.N.G.O.s కాలనీ, శ్రీ రామ స్ట్రీట్, ఖమ్మం రూరల్ & జిల్లా వారి సంజాయిషీ పొంది ఇందుమూలముగా తెలియజేయునది. నా క్లయింటు నుండి తేది. 16-01-2023న పింగుల రాజారావు, తండ్రి: సుందరం, వయస్సు: 48 సం.లు, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగం, నివాసం: తోవ్వరలక రాయుడుపాలెం గ్రామం, లింగపాలెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, అను వారు ఈ క్రింద తెలుపబడిన షెడ్యూల్ ఆస్తిపై రూ. 10,000/- ఇచ్చి బయాన అగ్రిమెంట్ చేసుకున్నారు. కాని జనవరి నెల, 2023 నుండి పలుమార్లు పెద్ద మనుషులు చేత రిజిస్ట్రేషన్‌కు రమ్మని కోరిన నేటి వరకు ఎటువంటి రెస్పాండ్ కాకుండా మరియు మిగతా అమౌంట్ కట్టడానికి రాకుండ ఉండటం వలన నేటి నుండి ఈ క్రింది షెడ్యూలు ఆస్తికి జరిగిన అగ్రిమెంట్ రద్దు అవుతుంది. కావున ఈ ప్రకటన ద్వారా యావన్మంది ప్రజలకు తెలియజేయుచున్నాను.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, లింగపాలెం మండలం, తోవ్వరలక రాయుడుపాలెం గ్రామం, చింతలపూడి సబ్ రిజిస్ట్రార్‌లోని గ్రామ రెవిన్యూ సర్వే నెంబర్: 125/3ఎ మింజుమలే విస్తీర్ణం: య. 2-30 సెంట్లు గల స్థిరాస్తి.

సం/- ఎర్ర జ్ఞానేశ్
గోరింట్ల శాంతరావు
తేది. 25-10-2023 సెల్: 94945 97539

ఎండ్ పోలియో

కొయ్యలగూడెం: పోలియో రహిత దేశంగా భారత్ ఎప్పుడూ నిలవాలి అని, ఇందుకోసం భారతీయులంతా స్వచ్ఛందంగా కృషి చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు విశ్వనాథ శర్మ పేర్కొన్నారు. మంగళవారం కొయ్యలగూడెంలో ఎండ్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి గొలిశెట్టి వాసు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మంతెన సోమరాజు, ఎస్కే అమీర్ భాష, చిరవూరి సాయి, ఐవీ అప్పారావు, బొమ్మ దుర్గ బాబు తదితరులు పాల్గొన్నారు.